సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023

అమ్మకానికి అంగన్‌వాడీ గుడ్లు..!



గుడిహత్నూర్ మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో గల కిరాణాషాపులో అంగన్‌వాడీ కోడిగుడ్లు అమ్ముతున్నారు. స్థానిక మహిళకు విక్రయించగా ఆమె దుకాణాదారుడిని నిలదీసింది.

8లో▸

ఓటు వినియోగంపై కలెక్టర్ పాట



కైలాస్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత, వినియోగం గురించి 'ఆదిలాబాద్ జిల్లాలో అందరం.. బైలెల్లి ఓటేద్దాం అందరం' అని కలెక్టర్ రాహుల్‌రాజ్ పాట రాశారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు సాధించాలి



కొండా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయ సమీపంలో గల కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్ వద్ద ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ సేవలను కలెక్టర్ కొనియాడారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన లక్ష్మణ్ బాపూజీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి రాజలింగు, డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, నాయకులు బేత రమేశ్, ఆశమ్మ, దత్తు పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో ముఖరా(కే) భేష్


Santosh Kumar J
@SantoshKumarBRS

Proud to share the incredible transformation of Mukhra (K) Village in Adilabad District! Saplings that have planted under #GreenIndiaChallenge initiative have flourished, turning the village into a lush green paradise. Kudos to the Sarpanch, MPTC and the amazing community for their dedication a greener future.

#EnvironmentalHeroes

2:16 1,304 views

రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ట్విట్టర్ వేదికగా ప్రశంసించిన పోస్ట్

ఇచ్చోడ: గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ముఖరా(కే) గ్రామంలో చేపట్టిన మొక్కల పెంపకం, పచ్చదనంపై రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ బుధవారం ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. గ్రామంలో మొక్కలు నాటుతూ సంరక్షిస్తున్న సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సభ్యుడు గాడ్గే సుభాష్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీతా కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ లోపు దరఖాస్తులు అందించాలని సూచించారు.

నీట్ కోచింగ్ కోసం..

ఉట్నూర్‌రూరల్: గిరిజన గురుకులాల ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం పీవీటీజీ తెగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హయాత్‌నగర్ సీవోఈలో 50 మందికి కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీలో ఉత్తీర్ణులైనవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, మెమో, కుల ధ్రువీకరణ పత్రాలతో గిరిజన గురుకులం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత భోజనం, వసతి, స్టడీ మెటీరియల్ ఇవ్వడంతోపాటు నిష్ణాతులైన బోధన సిబ్బందితో కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన



ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

బోథ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాల తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ బుధవారం సమావేశమయ్యారు. అనంతరం ఆన్‌లైన్ ఓటరు నమోదును పరిశీలించారు. తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు.

ట్విస్ట్ పాలిటిక్స్..!





సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎంపీ

రాథోడ్ బాపురావు, బోథ్ ఎమ్మెల్యే



- జిల్లాలో మారుతున్న సమీకరణలు
- కాంగ్రెస్ వైపు ముఖ్యనాయకుల చూపు
- ఎన్నికలవేళ బీజేపీ, బీఆర్ఎస్‌కు షాక్!
- కమలం, హస్తం అభ్యర్థుల ఖరారుపై జిల్లాలో కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి, ఆదిలాబాద్: శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండగా ఊహించని ట్విస్ట్‌లు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ వైపు చూస్తుండటం రాజకీయంగా సంచలనం కలిగిస్తోంది. బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రెండు రోజుల్లో కార్యకర్తలతో సమావేశమై తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని చెబుతున్నారు. మరోవైపు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించడం లేదు. అలాగని కాంగ్రెస్‌లో చేరబోయే విషయంపై కూడా బహిరంగంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. ఇది వ్యూహాత్మక మౌనమా? అనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

కొనసాగుతున్న ఉత్కంఠ

నెల క్రితం బీఆర్ఎస్ అభ్యర్థులను సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆదిలాబాద్ నుంచి జోగు రామన్న, బోథ్ నుంచి నేరడిగొండ జెడ్పీటీసీ సభ్యుడు అనిల్ జాదవ్, ఖానాపూర్ నుంచి భూక్య జాన్సన్‌నాయక్, ఆసిఫాబాద్ నుంచి కోవ లక్ష్మిని పార్టీ ప్రకటించింది. వారు ఇప్పటికే క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఏకంగా ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, ఆత్రం సక్కు, రాథోడ్ బాపురావుకు టిక్కెట్ దక్కలేదు. ఆత్రం సక్కుకు ముఖ్యమైన పదవి విషయమై పార్టీ నుంచి హామీ లభించినట్లు బీఆర్ఎస్‌లో చర్చ సాగుతోంది. రేఖానాయక్, రాథోడ్ బాపురావుకు అలాంటి పరిస్థితి లేదు. బోథ్ ఎమ్మెల్యే రెండ్రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తానని చెబుతున్నారు. మంగళవారం ఆయన నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అక్కడ కూడా ఆయనకు పార్టీ నుంచి ఎలాంటి హామీ లభించనట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటికీ పార్టీకి రాజీనామా విషయంలో ఆయన స్టాండ్ కొనసాగుతోంది. ఇక రేఖానాయక్ ఇంతకుముందు ప్రకటించినట్లే పార్టీ మారుతారా.. లేనిపక్షంలో ఆమె నిర్ణయం ఎలా ఉంటుందనేది ముందు తేలనుంది. కాగా, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థిత్వాల కోసం ఆయా నియోజకవర్గాల నుంచి పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ తొలి జాబితా అక్టోబర్ మొదటి వారంలో ఉంటుందని ఆ పార్టీ పెద్దలు చెబుతుండగా, దాంట్లో ఈ నియోజకవర్గాల నుంచి అభ్యర్థుల్ని ప్రకటిస్తారా? మలివిడతలోనే స్పష్టమవుతుందా..? అనేది వేచిచూడాల్సిందే. ఇక బీజేపీ జాబితాపై కూడా అందరి ఆసక్తి నెలకొంది. ఆయా అభ్యర్థుల్ని ప్రకటించే వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

కాంగ్రెస్ స్కెచ్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ సీట్లు గెలవాలని కాంగ్రెస్ స్కెచ్ వేస్తోంది. ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న అధికమంది అభ్యర్థులకు చట్టసభలకు పోటీ చేసిన అనుభవం లేదు. ఈ నేపథ్యంలో లోకసభ పరిధిలో ఒక సీనియర్ నేతను ఏదైన నియోజకవర్గం నుంచి బరిలో నిలపడం ద్వారా మిగతా నియోజకవర్గాలను సమన్వయపర్చుకునేలా ఉండాలన్నది పార్టీ వ్యూహమని ఓ ముఖ్య నేత పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ సోయం బాపూరావు పార్టీలోకి వస్తున్నారని ఏకంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నుంచి ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలోనే చర్చకు వచ్చిందనడం రాష్ట్రంలోనే ప్రాధాన్యత అంశంగా మారింది. ఎంపీ పార్టీ మారితే అది బీజేపీకి గట్టి ఎదురుదెబ్బే. బోథ్ నియోజకవర్గం నుంచి సోయంను బరిలోకి దింపాలన్నది ఆ పార్టీ వ్యూహంగా చర్చించుకుంటున్నారు. తద్వారా ఉమ్మడి జిల్లాలో బలమైన ఓటు బ్యాంక్ ఉన్న ఆదివాసీలపై దృష్టి సారించారు. కాగా, ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో మూడు ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఉండగా, రెండుచోట్ల ఆదివాసీలను బరిలోకి దించాలన్నదే పార్టీ ప్లాన్‌గా చర్చించుకుంటున్నారు.

చిన్నబోతున్న మీనం



మత్తడివాగులో చేపపిల్లలు వదులుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

- అస్తవ్యస్తంగా ఉచిత చేపపిల్లల పంపిణీ
- 'టెండర్ల' నుంచి సరఫరా దాకా అదేతీరు
- తీవ్రంగా నష్టపోతున్న మత్స్యకారులు
- కాంట్రాక్టర్లకే వంతపాడుతున్న ఆఫీసర్లు

కైలాస్‌నగర్: చేపపిల్లల పంపిణీలో పారదర్శకత లోపిస్తోంది. ఉచితంగా అందించే చేపపిల్లల సరఫరాను పక్కాగా నిర్వహించేలా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసినా.. సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినా.. కాంట్రాక్టర్ల కనికట్టుతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. చేపపిల్లల ఉత్పత్తికి ఇక్కడ చెరువులు లేనప్పటికీ ఉన్నట్లు చూపించి రాజకీయ నాయకుల అండదండలతో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు వాటి సరఫరాలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రేడింగ్, సైజుతో సంబంధం లేకుండా నాసిరకం చేపపిల్లలు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం చేపపిల్లల పంపిణీ జరిగేలా చూడాల్సిన మత్స్యశాఖ అధికారులు 'మామూలు'గా తీసుకుంటూ కాంట్రాక్టర్లకే వంత పాడుతుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. వీరి చర్య మత్స్యకారులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది.

ఆది నుంచి అక్రమాలే..

మత్స్యకారుల జీవనోపాధికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలు వదులుతోంది. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చిస్తోంది. అయితే టెండర్ల దశ నుంచే వీటి సరఫరాలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. చేపపిల్లల ఉత్పత్తి కోసం స్థానిక చెరువులు చూపించి రాజకీయ జోక్యంతో కాంట్రాక్టర్లు సీడ్ సరఫరా టెండర్లు దక్కించుకుంటున్నారు. తీరా జిల్లాకు అవసరమైన రొయ్య, చేపపిల్లలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి వదులుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులలో వదిలిన చేపపిల్లలన్నీ ఏపీ పాసింగ్ ఉన్న ఐషర్ వాహనాల్లో డ్రమ్ముల ద్వారా తీసుకువచ్చినవి కావడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఇలా ఆంధ్ర ప్రాంతం నుంచి వాటిని తీసుకువస్తుండటం అక్రమాలకు కారణమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిబంధనలు బేఖాతర్

చెరువులు, రిజర్వాయర్లలో చేపపిల్లలు వదిలే క్రమంలో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. టెండర్‌లో పొందుపర్చిన నిబంధనల మేరకు రెండు రకాల సైజులు గల చేపపిల్లలు సరఫరా చేయాల్సి ఉంటుంది. రిజర్వాయర్లలో 80–100 ఎంఎం, చెరువుల్లో 35–40 ఎంఎం సైజ్ గల చేప పిల్లలు వదలాలి. వాటిని వదిలే సమయంలో చేపపిల్లల సీడ్ సంఖ్యను ముందుగానే మత్స్య సహకార సంఘాల సభ్యులు, అధికారులకు తెలుపాలి. వారి సమక్షంలో ఆయా సైజ్ గల చేపపిల్లలు తూకం వేసి చెరువులు, రిజర్వాయర్లలో వదలాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఇలా జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సైజ్‌తో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా నాసిరకం గ్రేడింగ్ లేని వాటిని వదులుతున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. కాంట్రాక్టర్ వేసే తక్కువ సైజ్ చేపపిల్లలు పెద్ద చేపలు తినేస్తున్నాయని, కొన్ని వేసిన వెంటనే చనిపోతున్నట్లుగా మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ తక్కువ సైజ్ ఉన్న చేపపిల్లలు బతికినా సీజన్ నాటికి అవి విక్రయించేందుకు అవసరమైన పరిమాణానికి ఎదగడం లేదని చెబుతున్నారు. ఫలితంగా ప్రభుత్వం మత్స్యకారుల కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా వారికి ఆశించిన ప్రయోజనం కలగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వంత పాడుతున్న అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా నాసిరకం, సైజ్ తక్కువగా ఉన్న చేపపిల్లలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌ను అడ్డుకోవాల్సిన మత్స్యశాఖ అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. నిబంధనల మేరకు నాణ్యమైన, పరిమాణం కలిగిన వాటిని చెరువులు, రిజర్వాయర్లలో వేసేలా చూడాల్సిన సదరు అధికారులు కాంట్రాక్టర్లకే వంత పాడుతూ తమకు అన్యాయం చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి నిబంధనల మేరకు చేపపిల్లల పంపిణీ చేసేలా చూడాలని కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే పంపిణీ

ప్రభుత్వ నిబంధనల మేరకే కాంట్రాక్టర్‌కు టెండర్ అప్పగించాం. జిల్లాకు అవసరమైన చేప సీడ్ లభించే పరిస్థితి లేదు. కనుక పొరుగు రాష్ట్రం నుంచే సీడ్ తెచ్చుకుని తమ చెరువుల్లో డంపు చేస్తారు. అక్కడి నుంచి జిల్లాకు అవసరమైన సీడ్ సరఫరా చేస్తారు. తక్కువ సైజ్ చేపపిల్లలు తీసుకువస్తే వాటిని వెనక్కి పంపిస్తాం. మత్స్యకారులకు ఎలాంటి నష్టం జరగకుండా సహకార సంఘాల సభ్యుల సమక్షంలోనే చెరువుల్లో చేపపిల్లలు వదులుతున్నాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో సహజ సిద్ధమైన అందాలు కలిగిన ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయని, ఆదిలాబాద్ మరో కాశ్మీర్‌గా పిలువబడుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో కుంటాల, పొచ్చెర జలపాతాలు, జైనథ్ లక్ష్మీనారాయణస్వామి ఆలయం, ఉట్నూర్ ఫోర్ట్ తదితర పర్యాటక ప్రాంతాలున్నాయని తెలిపారు. వీటిని బాహ్య ప్రపంచానికి తెలియజేసేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. పర్యాటక రంగంతో ఎన్నో రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని, జిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో వందశాతం పోలింగ్ నమోదు చేసేందుకు విస్తృత అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి కళా ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, పాటలు, నాటిక, ఫొటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ చాటినవారికి కలెక్టర్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కుష్బూ గుప్తా, డీఆర్డీవో ఎస్.కిషన్, డీఈవో టీ ప్రణీత, డీవైఎస్వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బహుమతి ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మొట్టమొదటి డ్రైరన్ సక్సెస్




మోటర్ వద్ద పెంటారెడ్డి, ఇతర అధికారులు

జైనథ్: మండలంలోని హట్టిఘాట్ సమీపంలోగల పంప్‌హౌస్‌లో మొట్టమొదటి డ్రైరన్ సక్సెస్ అయింది. పెన్‌గంగ నదిలోని నీటిని తోడి లోయర్ పెన్‌గంగ ప్రాజెక్ట్ కాలువల్లో విడుదల చేసేందుకు వీలుగా నిర్మించిన హట్టిఘాట్ పంప్‌హౌస్‌లో ఆరు మోటర్లు ఉండగా, బుధవారం రాత్రి మొట్టమొదటి 5.5 మెఘావాట్స్ మోటర్‌కు డ్రైరన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ అడ్వైజర్ పెంటారెడ్డి హాజరయ్యారు. ఉదయం ఇరిగేషన్ సీఈ టీ శ్రీనివాస్, ఎస్ఈ రాము, ఇతర అధికారులతో కలిసి డ్రైరన్ కోసం అవసరమైన ఇతర పరీక్షలు నిర్వహించారు. నీళ్లు లేకుండా మోటర్ స్టార్ట్ చేసి 11 కేవీ ప్యానల్, సాఫ్ట్ స్టార్టర్స్, లోకల్ కంట్రోల్ ప్యానల్ పనితీరు పరిశీలించారు. సాయంత్రం 7.30–8.30 గంటల వరకు గంటపాటు డ్రైరన్ కొనసాగించారు. కాగా, డ్రైరన్‌లో మోటర్ టెంపరేచర్, వైబ్రేషన్స్ ఇతర యూనిట్లతో సమన్వయం అనుకున్న రీతిలో ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ టీ శ్రీనివాస్, ఎస్ఈ రాము, ఈఈ రవీందర్, డీఈ మనోహర్, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నేడు వెట్ ట్రయల్ రన్?

డ్రైరన్ సమయంలో మోటర్ పనితీరు, ఇతర యూనిట్లతో సమన్వయం చాలా చక్కగా ఉన్నందున గురువారం వెట్ ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు మొదటి మోటర్ డ్రైరన్ సక్సెస్ కావడంతో మిగతా ఐదు మోటర్ల పనితీరు కూడా అనుకున్న రీతిలోనే ఉంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

టెట్ ఫలితాల్లో పలువురి ప్రతిభ



నికిత

కైలాస్‌నగర్: ఈనెల 15న జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)–2023లో జిల్లాకు చెందిన పలువురు ప్రతిభ చాటారు. పరీక్షకు సంబంధించిన ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. పేపర్–1లో ఆదిలాబాద్ పట్టణం భుక్తాపూర్‌కు చెందిన నికిత 129 మార్కులు సాధించింది. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన కుమ్ర సాయిప్రియకు 112 మార్కులు వచ్చాయి.

జెడ్పీ చైర్మన్ ప్రత్యేక సమీక్ష

కైలాస్‌నగర్: జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్ బుధవారం తన చాంబర్‌లో జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ త్వరలో రానున్నందున పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు ప్రారంభించని పనులుంటే వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. సమావేశంలో సీఈవో గణపతి, డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేట్ ఖలీ రాక

ఆదిలాబాద్: వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని డబ్ల్యూడబ్ల్యూఈ రెజ్లింగ్ క్రీడాకారుడు గ్రేట్ ఖలీ గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నట్లు ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం 4 గంటలకు ఆయన పట్టణంలోని తిర్పెల్లి కాలనీలోగల శ్రీమహాలక్ష్మి గణేశ్ మండలి శోభాయాత్రలో పాల్గొంటారని తెలిపారు. అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆయన వెంట సాయిని రవికుమార్, సిద్ధార్థ్ తదితరులున్నారు.

నేడు గణేశ్ నిమజ్జనోత్సవం

- జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర
- పెన్‌గంగ నది వద్ద ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు

ఆదిలాబాద్: గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం నిమజ్జనోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రంలోని వినాయకచౌక్‌లో గల శిశుమందిర్‌లో తొలిపూజ చేసి నవరాత్రోత్సవాలు ప్రారంభించగా.. అక్కడి నుంచే నిమజ్జనోత్సవాలను ఆరంభించడం ఆనవాయితీ. హిందూ సమాజ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శిశుమందిర్‌లో నెలకొల్పిన వినాయక విగ్రహానికి కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శోభాయాత్ర ప్రారంభమవుతుంది. ఆ తర్వాతే పట్టణంలోని వివిధ మండపాల ఉత్సవ కమిటీలు శోభాయాత్రను అనుసరిస్తాయి.

బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు

వినాయక శోభాయాత్ర సజావుగా సాగేలా మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రోడ్లకు మరమ్మతు, వీధిదీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గురువారం శోభాయాత్రలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మొబైల్ టాయిలెట్ వాహన సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతోపాటు నిమజ్జనం సాఫీగా సాగేలా జైనథ్ మండలం డొల్లార వద్ద గల పెన్‌గంగ నది సమీపంలో రెండు క్రేన్‌లు ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత చర్యలు

గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భద్రత చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే శోభాయాత్ర సాగే వినాయక్‌చౌక్, అశోక్‌రోడ్, దేవిచంద్‌చౌక్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్ తదితర కూడళ్ల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. ప్రతీ కాలనీ నుంచి వచ్చే మండప నిర్వాహకులు క్రమపద్ధతిలో వినాయక నిమజ్జన శోభాయాత్ర సాగించేలా ప్రణాళికలు రూపొందించారు. శోభాయాత్ర నేపథ్యంలో పట్టణంలో 10 సెక్టార్లు, నాలుగు క్లస్టర్లు, 13 పికెటింగ్ పాయింట్స్, రెండు పెట్రోలింగ్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్టీ సిబ్బంది, అదనంగా స్పెషల్ పార్టీ సిబ్బందితో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూస్తామని పోలీస్ అధికారులు తెలిపారు. భక్తులు మద్యం సేవించకుండా సామరస్యంగా, ఐకమత్యంతో ఉత్సవాలు నిర్వహిస్తూ తమకు సహకరించాలని పోలీస్ అధికారులు కోరుతున్నారు.

పాటించాల్సిన సూచనలు..

- వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భారీ ఎత్తున సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తే విద్యుత్ తీగలు తగలకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది.
- నిమజ్జనోత్సవంలో జనాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అనుభవం ఉన్న ఎలక్ట్రీషియన్ తోడుగా ఉండేలా చూసుకోవాలి.
- మండప అలంకరణకు వాడే విద్యుత్ లైట్లను ఏడు అడుగులకు మించకుండా చూసుకోవాలి.
- విగ్రహాలను తరలించే వాహనాలు సరిగా ఉన్నాయా.. లేవా అని చూసుకోవాలి. అనుభవం ఉన్న, మద్యం అలవాటు లేని డ్రైవర్లకు మాత్రమే వాహనాలు అప్పగించాలి.
- శోభాయాత్రలో మద్యం సేవించి పాల్గొనకపోవడమే శ్రేయస్కరం.
- చిన్న పిల్లలను నిమజ్జనానికి దూరంగా ఉంచాలి.
- ఈత రానివారు నదీ ప్రవాహానికి దగ్గరగా వెళ్ల కూడదు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని పెన్‌గంగ వద్ద ఏర్పాట్లను అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా బుధవారం పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగ నది ప్రాంతాన్ని సందర్శించిన ఆమె అక్కడ ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శైలజ, డీఈ యూనుస్, జైనథ్ ఎస్సై పురుషోత్తం తదితరులున్నారు.

శాంతియుతంగా నిర్వహించుకోవాలి



జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనానికి సంబంధించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. 450 మంది పోలీసులతో భద్రత చర్యలు చేపట్టాం. జిల్లా కేంద్రంలో నిమజ్జన ప్రదేశంలో ప్రత్యేకంగా సీసీటీవీల పర్యవేక్షణ, వినాయక నిమజ్జన ప్రాంతంలో నదికి నలువైపులా లైట్లు, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశాం. నిమజ్జన సమయంలో విగ్రహం వెంట ఐదుగురు సభ్యులు ఉండేలా చూసుకోవాలి. చిన్నపిల్లలను వెంట తీసుకెళ్లకూడదు. నిమజ్జనోత్సవాలను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

క్లుప్తంగా

దీక్ష శిబిరంలో పడిపోయిన ఆశ వర్కర్


రాజమణికి నీళ్లు తాగిస్తున్న కార్యకర్తలు

కడెం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరంలో దీక్ష చేపట్టిన మండలంలోని సారంగాపూర్ ఆశవర్కర్ రాజమణి హైబీపీతో కిందపడింది. గమనించిన తోటి ఆశావర్కర్లు సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖానాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇకనైనా ఆశా వర్కర్లకు న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతున్నారు.

స్వర్ణ ప్రాజెక్టు ఒకగేటు ఎత్తివేత


ఒక గేటు ఎత్తిన దృశ్యం

సారంగపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1183 అడుగులు(1.484 టీఎంసీ) కాగా ప్రాజెక్టులోకి వెయ్యి క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో ఒక గేటు ద్వారా అంతే మొత్తం నీటిని స్వర్ణ నదిలోకి విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1183 అడుగుల వద్ద స్థిరంగా ఉంచామని జేఈ మధుపాల్ తెలిపారు.

కడెం హరితకు బెస్ట్ రిసార్ట్స్ అవార్డు


తిరుపతికి అవార్డు అందిస్తున్న మంత్రి

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్ బెస్ట్ టూరిజం రిసార్ట్ అవార్డ్‌కు ఎంపికైంది. పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పర్యాటకశాఖ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, ఎండీ మనోహర్‌రావు చేతుల మీదుగా కడెం హరితరిసార్ట్స్ మేనేజర్ ఎస్.తిరుపతి అవార్డును అందుకున్నాడు. సందర్శకులకు చక్కని అతిథ్యమిస్తున్న కడెం రిసార్ట్స్ మూడో అవార్డును అందుకుంది.

కిడ్నాప్ కేసులో మూడేళ్ల జైలు

కాసిపేట: మైనర్‌ను కిడ్నాప్ చేసిన కేసులో గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన పెగడపల్లి వెంకటేష్‌కు మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రెండువేల రూపాయల జరిమానా బుధవారం మంచిర్యాల సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సేషన్స్ జడ్జి అర్పిత మారం రెడ్డి విధించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. 2016 అక్టోబర్ 30న నమోదైన కేసు ప్రకారం హైదరాబాద్ గాజుల రామారంకు చెందిన జెమాల్‌పూర్ అమర్‌నాథ్ కూతురు కల్వారి చర్చికి వచ్చింది. అక్కడి నుంచి కనిపించకుండ పోయినట్లు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం పైవిధంగా తీర్పు వచ్చింది

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పురుగు మందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం
- శరీరం నిండా దుస్తులు ధరించాలి
- నోటికి, ముక్కుకు మాస్క్ తప్పనిసరి
- వ్యవసాయాధికారుల సూచనలు


పొలంలో పురుగుల మందులు పిచికారీ చేస్తున్న రైతు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వరి పంటలో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు కూలీలు, రైతులు కనీస జాగ్రత్తలను తీసుకోవడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగు మందుల పిచికారీలో తీసుకోవాలిసిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విషప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రకాలుగా పురుగు మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందని చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించే ప్రమాదముంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.
- క్రిమిసంహారక మందుల పిచికారీ ద్వారా వెలువడే వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తుంటే ముక్కు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ.
- పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మందు ప్రభావం ఎక్కువై మరణం కూడా సంభవిస్తుంది.

ఇలా చేయాలి..

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమశ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స అందించాలి. క్రిమిసంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళ్తే వాంతి చేయించే మార్గాలు అన్వేషించాలి. గ్లాసు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడి కలిపి తాగించాలి.

జాగ్రత్తలు పాటించాలి



క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై నిండా దుస్తులు ధరించాలి. ముక్కు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు.

– నాగరాజు, ఏఈవో

నిమజ్జన శోభాయాత్రలో అపశ్రుతి


గాయపడ్డ ఓర్సు రాకేశ్


గాయపడ్డ అల్లెపు అరవింద్


గాయపడ్డ సూర రాకేశ్

- ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్లెక్సీ తగిలి విద్యుత్ ప్రమాదం
- ముగ్గురు బాలురకు తీవ్ర గాయాలు

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో బుధవారం వేకువ జామున అపశ్రుతి చోటు చేసుకుంది. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన యువసేన యూత్ బాలల గణేష్ నిర్వాహకులు ట్రాక్టర్ ట్రాలీలో విగ్రహంతో శోభాయాత్ర చేపట్టారు. తెల్లవారుజామున మండపానికి సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ట్రాక్టర్‌లోని వినాయకుని విగ్రహం వెనుక ఉన్న ఫ్లెక్సీ తగలడంతో విద్యుత్ ప్రమాదం సంభవించింది. దీంతో అక్కడే ఉన్న అల్లెపు దుర్గ వెంటనే సాహసోపేతంగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ట్రాక్టర్‌పై ఉన్న అల్లెపు అరవింద్, ఓర్సు రాకేష్, సూర రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతోనే ప్రమాదం సంభవించిందని, సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ పరామర్శించారు.

రోడ్డుపై రాళ్ల కారణంగానే ప్రమాదం

రోడ్డుపై ట్రాక్టర్‌కు అడ్డుగా రాళ్లు ఉండడమే ప్రమాదానికి కారణమని విద్యుత్ శాఖ ఏడీఈ కేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండపైకి ట్రాక్టర్ టైర్ వెళ్లడంతో ఒక వైపు వంగి తొమ్మిది ఫీట్ల ఎత్తున్న ఫ్లెక్సీకి తగిలి ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాదం జరిగిన సెకన్ల వ్యవధిలోనే డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న ఫ్యూజు కరిగిపోయిందని, ట్రాన్స్‌ఫార్మర్ కూడా ట్రిప్ కావడంతో కరెంట్ షాక్ తగిలిందని తెలిపారు. దీంతో వారికి గాయాలయ్యాయని తెలిపారు.

నిమజ్జనోత్సవంలో స్వల్ప ఉద్రిక్తత

- ప్రశాంతంగా ముగిసిన శోభాయాత్ర

భైంసాటౌన్: భైంసా పట్టణంలో మంగళవారం వినాయక నిమజ్జనోత్సవంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అర్ధరాత్రి దాటిన తరువాత పిప్రికాలనీలో గణనాథులను తరలించాలనే క్రమంలో పోలీసులు, యువకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేయడంతో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారని ఆరోపిస్తూ కిసాన్‌గల్లిలో పలువురు శోభాయాత్రను నిలిపేసి ధర్నా చేపట్టారు. బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ లాఠీచార్జి విషయం తన దృష్టికి రాలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్ర యథావిధిగా కొనసాగింది.

అవాస్తవాలు ప్రచారం చేయవద్దు..

నిమజ్జనోత్సవంలో యువకులపై పోలీసులు లాఠీచార్జి చేశారన్న మాట అవాస్తవమని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల్లో భయాందోళన కలిగించేలా అవాస్తవాలు ప్రచారం చేయవద్దన్నారు. పిప్రికాలనీలో యువకులు గాయపడిన ఘటనపై విచారణ చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో తప్పిన ప్రమాదం


లీకైన గ్యాస్ సిలిండర్

ఆదిలాబాద్‌రూరల్: గ్యాస్ లికేజీతో మంటలు చెలరేగగా పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రామాయి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం నిమిత్తం వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లికేజీతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు, పాఠశాల సిబ్బంది వెంటనే మంటలు ఆర్పేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో వంట మనిషి వనిత చేతు కాలడంతో ఆమెను చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

యువకుడు ఆత్మహత్య

కుభీర్: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ.షరీఫ్ వివరాల ప్రకారం.. మండలంలోని దొడర్నా2కు చెందిన జాదవ్ కృష్ణ (31) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చేసరికి మృతిచెందాడు. భార్య జాదవ్ శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

జ్వరంతో బాలుడి మృతి

- హర్కపూర్‌తండాలో విషాదం


రాథోడ్ దిలీప్ (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో బాలుడు మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలోని హర్కపూర్‌తండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... రాథోడ్ దన్‌రాజ్, సంగీత దంపతులకు దీపక్, దిలీప్(15) ఇద్దరు కుమారులున్నారు. దిలీప్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అయితే 15రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి, పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించినా నయం కాలేదు. దీంతో ఈ నెల 17న ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు పచ్చకామెర్లు, టాయిఫాడ్ ఉన్నట్లు నిర్ధారించి చికిత్స నిర్వహించారు. రోజురోజుకూ బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో రిమ్స్ వైద్యులు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఉస్మానియ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరి స్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. బాలు డి మృతితో హర్కపూర్‌తండాలో విషాదం అలుముకుంది.

పారిశుధ్య కార్మికుడు మృతి


వడ్లూరి లక్ష్మణ్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన వడ్లూరి లక్ష్మణ్(40) గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గణేష్ శోభాయాత్రలో డ్యాన్స్ చేస్తున్న క్రమంలో ఫిట్స్‌తో పాటు చాతీలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన గ్రామస్తులు కారులో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అతడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి


కిరణ్ మృతదేహం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న మాసం కిరణ్(35) మృతి చెందాడు. రూరల్ ఎస్సై చంద్రమోహన్ కథనం ప్రకారం... కిరణ్ వినాయక నిమజ్జనం సందర్భంగా బైక్‌పై పెట్రోలింగ్‌కు వెళ్తుండగా మంజులాపూర్ వద్ద భైంసా వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కిరణ్ స్వగ్రామం బోథ్ మండలం సాకేర గ్రామం కాగా అతడికి భార్య, 10ఏళ్ల లోపు కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

అమ్మకానికి అంగన్‌వాడీ గుడ్డు

- దుకాణాదారుడిని నిలదీసిన కాలనీ మహిళలు


దుకాణాదారున్ని నిలదీస్తున్న మహిళ

గుడిహత్నూర్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింత, చిన్నారులకు పౌష్టికాహారం అందించే ప్రక్రియలో భాగంగా కోడిగుడ్లను సరఫరా చేస్తోంది. అయితే ఈ కోడి గుడ్లు లబ్ధిదారులకు సక్రమం అందడం లేదనే విమర్శలు తరుచూ వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లపై స్టాంపు వేసి సరఫరా చేస్తోంది. దీని ద్వారా బయట మార్కెట్‌లో ఉచిత సరఫరా గుడ్ల విక్రయాలు అరికట్టేందుకు వీలైంది. అయితే మారుమూల ప్రాంతాల్లో ఇంకా పరిస్థితిలో మార్పు కన్పించడం లేదు. మండల కేంద్రంలో వడ్డెర కాలనీలోని ఓ కిరణా దుకాణంలో గుడ్లు కొనుగోలు చేయడానికి వెళ్లిన స్థానిక మహిళకు అంగన్‌వాడీ గుడ్లు ఇవ్వడంతో ఆమె దుకాణదారున్ని నిలదీసింది. ఈ గుడ్లు నీకెవరు ఇచ్చారని ప్రశ్నించింది. దీంతో పలువురు మహిళలు అక్కడికి చేరుకొని కొన్ని రోజులుగా తమకు గుడ్లు అందడం లేదని ఆరోపించారు. కానీ కిరాణా దుకాణంలో అమ్మకానికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ కాలనీకి చేరుకొని దుకాణదారుడిని వాకబు చేసింది. సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ, ఆయా కార్యకర్తలు కాకుండా లబ్ధిదారుల్లో ఎవరో అమ్ముకుని ఉంటారని తెలిసిందని, పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఏదేమైన పేదలకు అందాల్సి పౌష్టికాహారం పక్కదారి పట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విజయ స్కూల్ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

నిర్మల్‌టౌన్: ఈనెల 25, 26వ తేదీల్లో జరిగిన అథ్లెటిక్స్, నెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా కేంద్రంలోని విజయ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ అండర్- 14 బాలికల విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో కె.లాస్య (9వ తరగతి), అండర్ 16, 100 మీటర్ల పరుగు పందెంలో ఎస్.సంజన (10వ తరగతి), లాంగ్ జంప్ అండర్-16 బాలికల విభాగంలో బి.షారోన్ (10వ తరగతి) జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలలో ఇ.ఇష్వంత్ (10వ తరగతి), జి.ఉజ్వల్ వర్ధన్‌రెడ్డి, ఎ.నవనీత్‌రెడ్డి (9వ తరగతి) జోనల్, రాష్ట్ర స్థాయిలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విజేతలను పాఠశాల కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి అభినందించారు.

రెజ్లింగ్‌లో ముధోల్ విద్యార్థికి బంగారు పతకం


గోల్డ్‌మెడల్‌తో విద్యార్థి ఆకాశ్

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం.ఆకాష్ రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపల్ కైసర్‌పాషా తెలిపారు. 61వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు 23వ తేదీన హన్మకొండలో నిర్వహించగా ఆకాష్ బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపాడు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. అక్టోబర్ 4వ తేదీన మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, గంగాధర్, జెడ్పీఎస్ఎస్ స్కూల్ దాగాం పీఈటీ ప్రేమలత అభినందించారు.

గోదావరినదిలో చిక్కుకున్న గేదెల కాపరులు


గేదెల కాపరులను కాపాడిన ఎస్సై, పోలీసులు

సోన్: మండల కేంద్రానికి చెందిన గేదెల కాపరులు గోదావరిలో చిక్కుకోవడంతో బుధవారం ఎస్సై తన సిబ్బందితో వెళ్లి కాపాడారు. వివరాల ప్రకారం ... సోన్ మండలానికి చెంది గేదెల కాపారులు రోజులాగే గోదావరి మధ్యలో కుర్రు ప్రాంతానికి గేదెలను తీసుకుని వెళ్లారు. ఆర్క రవి, పల్లికొండా పోశెట్టి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి ప్రవాహం ఎక్కువై కావడంతో వారితో పాటు 80 గేదెలు చిక్కుకున్నాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై సంతోషం రవీందర్ తన సిబ్బందితో వెళ్లి ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి నాలుగు గేట్లను మూసివేయించారు. వరద ఉధృతి తగ్గడంతో మహేందర్ అనే మత్స్యకారుడి సాయంతో బయటకు తీసుకొచ్చారు. వీరిని కాపాడిన ఎస్సై రవీందర్, పోలీసులు ప్రతాప్‌రెడ్డి, శేఖర్, శివకుమార్‌లను సీఐ నవీన్‌కుమార్ అభినందించారు.

ఓటరు జాబితా రూపొందించాలి

- పరిశీలకులు ఆహ్మద్ నదీమ్


మాట్లాడుతున్న ఆహ్మద్ నదీమ్, పాల్గొన్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని కార్మిక శాఖ కమిషనర్, ఓటరు జాబితా పరిశీలకులు ఆహ్మద్ నదీమ్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్‌లతో కలిసి జూలై 15 నుంచి సెప్టెంబర్ 20 వరకు అందిన దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిష్కరించాలని సూచించారు. అక్టోబర్ 4న తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం జిల్లా రెవెన్యూ అధికారి జాడి రాజేశ్వర్, మంచిర్యాల ఆర్డీవో రాములు, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి దత్తు, ఎన్నికల తహసీల్దార్లు దేశ్‌పాండే శ్రీనివాస్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

భైరందేవ్ విగ్రహం కనిపించింది..!


కనిపిస్తున్న భైరందేవ్ విగ్రహం

బేల: శాతవాహనుల కాలంలో మండలంలోని సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని ఆదివాసీల ఆరాధ్యదైవమైన భైరందేవ్, మహాదేవ్ ఆలయాలు నల్లరాతితో నిర్మించబడ్డాయి. ఏళ్ల నుంచి ఈ కాలం వరకు భైరందేవ్ ఆలయంలో పూజల్లో భాగంగా వేసే చంద్రంతో విగ్రహం మూసుకుపోయింది. ఈ భైరందేవ్ విగ్రహం పూర్వీకులు సైతం ఎవరు చూడలేదు. రోజువారీలా ఆలయంలో బుధవారం రాత్రి పూజారులు భైరందేవ్ ఆలయంలో పూజలు చేసి బయటకు వస్తుండగా విగ్రహం పైభాగపు చంద్రం తొలగిపోయింది. ఈ క్రమంలో అద్భుతమైన భైరందేవ్ విగ్రహ రూపం కనిపించింది. ఈ విషయం ఒకరి నుంచి మరొకరికి తెలియడంతో మండల వాసులు ఆలయానికి చేరుకుని పూజలు చేస్తున్నారు. రాత్రంతా భజనలతో జగారం చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావులు తెలిపారు.



'మంచు'సిత్రం

అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువలేదు. సాధారణంగా చలికాలంలో ఇక్కడ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి ఆకాశంలోని మేఘాలు అవనిని చేరుకున్నట్లు పొగమంచు కమ్ముకుంటుంది. వర్షాకాలం పూర్తి కాకముందే జిల్లాలోని గ్రామీణ, అటవీ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గి జాతీయ రహదారి దట్టమైన పొగమంచుతో శీతాకాలపు అందాలతో మైమరిపిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

